క్లుప్తంగా

నేడు ఉచిత హియరింగ్ టెస్ట్

తిరుపతి కల్చరల్: తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శని, ఆదివారాల్లో ఉచిత హియరింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆడియాలజిస్టు డాక్టర్ పి.గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి మొబైల్ ఫోను కనెక్టివిటీ, బ్లూటూత్ రీ చార్జబుల్, డిజిటల్ వంటి సూక్ష్మమైన వినికిడి హియరింగ్ ఎయిడ్స్ ఉచితంగా ట్రిల్స్ అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే హియరింగ్ ఎయిడ్స్‌పై 25 శాతం డిస్కౌంట్ ఇస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9849085342లో సంప్రదించాలని కోరారు.

డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి


అలిపిరి డిపోను పరిశీలిస్తున్న డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం అలిపిరి డిపోను పరిశీలించారు. బస్సుల కండీషన్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. చిన్నపాటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని మెకానిక్కులను ఆదేశించారు. ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడం బాధాకరమని, మరోసారి అలాంటి సంఘటనలకు తావులేకుండా డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలని వివరించారు.

15 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడిన 15 మందికి రూ.12 వేల జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంప్ కోర్టులో తీర్పుచెప్పారు. తిరుమల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరానికి పాల్పడిన ఐదుగురికి రూ.2 వేలు చొప్పున, తిరుమల వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడిన 10 మందికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించారు.

సీఐ శివప్రసాద్‌రెడ్డికి సత్కారం


సీఐ శివప్రసాద్ రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సీఐగా బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్ రెడ్డిని శుక్రవారం తిరుచానూరు, ముండ్లపూడి సర్పంచులు రామచంద్రారెడ్డి, సురేష్ రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి సత్కరించారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ, స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వార్డు సభ్యుడు మునీంద్ర రాయల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు మించిన వసతులు

- మెరుగైన విద్య అందించడమే సీఎం లక్ష్యం
- అందుకోసం రూ.కోట్లు వెచ్చింపు
- జీవితంలో ఉన్నతంగా స్థిరపడడమే సీఎంకు మీరిచ్చే కానుక
- జగనన్న ఆణిముత్యాల వేడుకలో ఎమ్మెల్యే భూమన


జగన్న కిట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే భూమన, కమిషనర్ హరిత, డీఈఓ శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్‌కు మించిన వసతులు కల్పించినట్టు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్సీజీఎస్‌ఎం ఉన్నత పాఠశాలలో శుక్రవారం తిరుపతి నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాల వేడుకను డీఈవో వి.శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగంలో సమూల మార్పులు చేపట్టారని తెలిపారు. పేద పిల్లల విద్యకు ఆర్థిక సమస్యలు తలెత్తకూడదన్న సత్సంకల్పంతో అనేక పథకాలు అందిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించడమే సీఎంకు మీరిచ్చే కానుక అని తెలిపారు. టాపర్లే కాకుండా డల్లర్లు సైతం చదువులో రాణించేలా వారిని తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని, ఆ బాధ్యతను గుర్తించి ప్రతి విద్యార్థీ ఉన్నతికి దోహదపడాలని పిలుపునిచ్చారు. మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ప్రయోజకులవ్వాలని విద్యార్థులకు సూచించారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వచ్చిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రయోజకులను చేయాలని పిలుపునిచ్చారు.

నగదు పారితోషికం, సన్మానం

పదో తరగతి ఫలితాల్లో తిరుపతి నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. 572 మార్కులతో మొదటి స్థానాలు సాధించిన తంబువానిగుంట నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థి టి.వేణుగోపాల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని బి.రుషిత సునందకు రూ.15 వేల బహుమతి, బంగారు పతకం, సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేశారు. 571 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.వైష్ణవీకి రూ.10 వేలు, వెండి పతకం, జ్ఞాపిక, సర్టిఫికెట్, 565 మార్కులతో తృతీయ స్థానం సాధించిన ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని చానుమకు రూ.5 వేలు, కాంస్య పతకం, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. అనంతరం పిల్లలకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బసవ గీత, సీఎంఓ సురేష్, ఎంఈఓ ప్రభాకర్‌రాజు, డీసీఈబీ కార్యదర్శి వంశీరాజ్, సభ్యుడు ఎస్.విశ్వనాథరెడ్డి, హెచ్‌ఎంలు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

19 నుంచి శ్రీశక్తి పీఠంలో వారాహి నవరాత్రులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలో ఉన్న శ్రీశక్తి పీఠంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు శ్వేత వారాహీ అమ్మవారి నవరాత్రులను శ్రీశక్తి పీఠ వ్యవస్థాపకులు సిద్దేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సాయి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదిరోజులు అతి విశిష్టమైన వారాహి మంత్ర హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయంలో కొలువైన శ్వేత వారాహీ అమ్మవారు 19న ఆది వారాహీ దేవిగా, 20న శ్రీ లక్ష్మీ వారాహి దేవిగా, 21న శ్రీ బృహద్వారాహి దేవిగా, 22న శ్రీ లఘు వారాహి దేవిగా, 23న శ్రీ స్వప్న వారాహి దేవిగా, 24న ధూమ్ర వారాహి దేవిగా, 25న శ్రీ వజ్ర వారాహీ దేవిగా, 26న శ్రీ శ్వేత వారాహీ దేవిగా, 27 శ్రీ కిరాత వారాహి దేవిగా భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 28వ తేదీన పూర్ణాహుతితో నవరాత్రులను ముగించనున్నట్లు చెప్పారు.

నేడు తెలుగు గంగ నీటి సరఫరాకు అంతరాయం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో శనివారం తెలుగు గంగ నీటి సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఎస్ఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి నీటి సరఫరా చేసే తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ మెయింటినెన్సులో భాగంగా అమృత్ పథకంలో ఎండి.పుత్తూరు పంపింగ్ స్టేషన్ నుంచి మంగళం పంపింగ్ స్టేషన్ వరకు కనెక్షన్ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. పంపింగ్ మెయిన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇచ్చే పని చేస్తున్నందున శనివారం నీటి సరఫరా ఉండదని వెల్లడించారు. అత్యవసరమైన వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకర్ కోసం వార్డు నెం.4 నుంచి 9 వరకు, వార్డు నంబర్ 12, 13, సంప్రదించాల్సిన అధికారులు డీఈఈ వి.సంజీవ కుమార్ (9849907496), వార్డు నంబర్ 10, 11, 25, 26, 27, 32, 33 ప్రజలు డీఈఈ కె.దేవిక (9849983061), వార్డు నంబర్ 3, 14 నుంచి 22 వరకు డీఈఈ జి.మహేష్ (9949095227), వార్డు నంబర్ 1, 2, 42 నుంచి 50 వరకు డీఈఈ ఏ.విజయ్‌కుమార్‌రెడ్డి (9949905556)ని సంప్రదించాలని కోరారు.

కర్ణంవారిపల్లె నుంచి సంతగేటుకు తారురోడ్డు


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

ఎర్రావారిపాళెం(భాకరాపేట): ఎర్రావారిపాళెం మండలం చెరుకువారిపల్లె పంచాయతీ కరణంవారిపల్లె నుంచి బేరిపల్లె మీదుగా సంత గేటు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో రైతులు రోడ్డు లేక కాలినడకన కిలోమీటర్ల నడిచి తమ పంటలను తీసుకెళ్లాల్సి వచ్చేది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో రైతుల కష్టాలు తీరాయి. మాజీ సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి, ఎంపీటీసీ సునీల్‌కుమార్, స్థానిక సర్పంచ్ మంగమ్మ చొరవ తీసుకుని స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలను కలుపుకుని రోడ్డు వేసేందుకు రైతులను ఒప్పించారు. దీంతో ఏళ్లతరబడి రోడ్డు లేక అవస్థలు పడుతున్న ప్రజలకు రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం గ్రామ ప్రజలతో కలిసి మాజీ సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి ఆధ్వర్యంలో పనులకు భూమి పూజ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల: మండల కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పాకాల డీఈఈ నరేంద్ర తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని పాకాల, పులిచెర్ల, పూతలపట్టు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తిరుచానూరు(చంద్రగిరి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏపీఎస్పీడీసీఎల్ తిరుచానూరు ఏఈ గణపతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పాడిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముండ్లపూడి, కొత్తూరు, పానకం, బ్రాహ్మణపట్టు, తండ్లం, వేమూరు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ బి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. బీఏ(చరిత్ర), బి.కామ్(కంప్యూటర్స్), బీఎస్సీలో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ మైక్రో బయాలజీ కోర్సులు మూడేళ్ల కాలవ్యవధితో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్ట్, స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ స్కిల్ కోర్సులు ప్రతి విద్యార్థిని తప్పక చదివే సబ్జెక్టుగా ఉంటుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని లేదా నేరుగా కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరన్ని వివరాలకు 9441964145, 9248852999, 9491312865 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో జగనన్న ఆణిముత్యాలు


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ప్రోత్సాహకాలు అందజేసిన మోహిత్‌రెడ్డి
- ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్ష

పాకాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో మెరిసిన జగనన్న ఆణిముత్యాలను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇందులో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల ను అభినందించారు. మండలంలోనే 568 మార్కులతో మొదటిస్థానంలో వెన్నెల, 567 మార్కులతో రెండవ స్థానంలో ఆఫియాకౌసైన్, 554 మార్కులతో మూడో స్థానంలో నవదీప్ నిలిచారు. వారికి మోహిత్‌రెడ్డి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000ల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యకు పదవ తరగతి ఉత్తీర్ణత కీలకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పట్టుదలగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని, నిరుపేద ప్రజలకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ కస్తూరి, ఎంపీడీఓ ప్రభాకర్, హెచ్‌ఎం దేవరాజులురెడ్డి పాల్గొన్నారు.





వీసీ భారతికి సత్కారం

తిరుపతి మంగళం: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ వీసీగా నియమితులైన డి.భారతి శుక్రవారం ఎమ్మెల్యే లు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను వారు అభినందించి, శాలువాతో సత్కరించారు.

చరిత్రకు సాక్ష్యం కృష్ణమనాయుడు కుంట

తిరుపతి తుడా: స్థానిక చెన్నారెడ్డి కాలనీలో ఆధునికీకరిస్తున్న కృష్ణమనాయుడు కుంట అభివృద్ధి పనులను మేయర్ శిరీష శుక్రవారం పరిశీలించారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ పునీత, డీఈ గోమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

రేపు మహతిలో పౌరాణిక, సాంఘిక నాటికల ప్రదర్శన

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి పౌరాణిక, సాంఘిక నాటకలు ప్రదర్శిస్తున్నట్లు కోనేటి సుబ్బరాజు నాట్య కళా పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నాటక ప్రదర్శన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన తన అన్న, టీటీడీ ఏఈవో కోనేటి దుర్గరాజు జ్ఞాపకార్థం నాటక ప్రదర్శన చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో సాయంత్రం 5.30 గంటలకు పిఠాపురం స్నేహాంజలి ఆర్ట్స్ వారి మనుషుల బాంధవ్యాలను పెంపొందించే చక్కటి సందేశాత్మకమైన ×చింత చచ్చినా* సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం 6.30 గంటలకు శ్రీకృష్ణ రాయభారం నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. కోనేటి సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఉపాధ్యక్షులు ఆమూరి సుబ్రమణ్యం, కె.రాధాక్రిష్ణ, జాయింట్ కార్యదర్శి కన్నెప్పగారి కేశవులురెడ్డి, కోశాధికారి డి.గోపాల్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శాంబోలు హరినాథ్, చంద్రబాబు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: పద్మావతిపురం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని, ఆక్రమణకు గురవుతున్న శ్మశానాన్ని కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం బాధితులతో కలిసి పద్మావతిపురం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరాభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి రోడ్ల విస్తరణ చేయడం అభినందనీయమన్నారు. పద్మావతిపురంలో పది మంది ఇళ్లు కొంత భాగం కోల్పోయారని పేర్కొన్నారు. వారికి న్యాయం చేస్తామని వీఆర్వో, స్థానిక ప్రజాప్రతినిధులు, తిరుచానూరు సీఐ కమిటీ వేశారని తెలిపారు. అదే విధంగా శ్మశాన స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడతామని చెప్పారని వెల్లడించారు. నెల రోజులు గడిచినా న్యాయం చేయలేదని తెలిపారు. బాధితులకు న్యాయం చేసేంత వరకు నిరసన దీక్ష చేపడతామని తెలిపారు. వీఆర్వో అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు శ్మశాన స్థలాన్ని కాపాడతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నేత రాధాక్రిష్ణ, నాయకులు ఎన్‌డీ.రవి, సీహెచ్.శివ, కేవై.రాజా, రత్నమ్మ, గోవిందస్వామి, లక్ష్మీ, మునీశ్వర్, శ్రీనివాస్, బాల పాల్గొన్నారు.

రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే చర్యలు


పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: పరిశుభ్రమైన తిరుపతే అందరి లక్ష్యం కావాలని, రోడ్లపై వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత హెచ్చరించారు. ఆమె శుక్రవారం 34, 35 డివిజన్లలో పారిశుద్ధ్యం అమలును పరిశీలించారు. కాలువలో వ్యర్థాలు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లోని కూడళ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త పారబోయడంపై మండిపడ్డారు. రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తా చెదారం లేకుండా చూడాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ మన ఇల్లు– మన తిరుపతి అన్న భావనతో ప్రతి ఒక్కరూ చెత్తపై స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని కోరారు. ఇంట్లోని చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా సిబ్బందికి అందజేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్తను రోడ్లపై పారబోస్తున్నారని, రోడ్లపై నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను వేసే వారికి జరిమానా విధించనున్నట్టు చెప్పారు. భవానీనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిమానా విధించాలని హెల్త్ ఆఫీసర్ హరికృష్ణను ఆదేశించారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈ గోమతి, శానిటరీ సూపర్ వైజర్ చెంచెయ్య, వార్డు నాయకులు దినేష్ రాయల్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే భారీ భవన నిర్మాణం


ఎలాంటి అనుమతులు లేవు

తిరుపతి తుడా: తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డు లో అనుమతి లేకుండానే భారీ భవనాన్ని నిర్మిస్తునఆనరు. 22ఎ నిషేధిత పరిధిలో ఉన్న భూమిలో మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకోకుండానే భవనాన్ని దర్జాగా నిర్మిస్తున్నారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో 5 అంతస్తులు నిర్మిస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. కపిలతీర్థం రోడ్డు– తిరుమల బైపాస్ రోడ్డు 20 అడుగుల లింక్ రోడ్డును అభివృద్ధి చేస్తున్న క్రమంలో ఈ నిర్మాణం వెలుగుచూసింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణదారుడికి నోటీసులు జారీచేశారు. కార్పొరేషన్ అనుమతులు పొంది భవననిర్మాణం చేసి ఉంటే కార్పొరేషన్‌కు సుమారు రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూరేది. అలానే ప్లాన్‌ప్రకారం భవన నిర్మాణం చేపట్టాల్సి ఉండేది. ఎలాంటి సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణం చేపట్టడం భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే తీవ్ర ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు.

కపిలతీర్థం రోడ్డులో నిర్మిస్తున్న భవనానికి ఎలాంటి అనుమతులు లేవు. ఇప్పటికే యజమానికి నోటీసులు జారీ చేశాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా, ప్లానింగ్‌కు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు.

– బాలసుబ్రమణ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

పాలేటమ్మకు వెండి కిరీటం సమర్పణ


వెండి కిరీటధారణతో పాలేటమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ దేవత పాలేటమ్మకు గ్రామస్తులు పింగాణి రామస్వామిరెడ్డి, సుశీలమ్మ దంపతులు వెండి కిరీటాన్ని సమర్పించారు. శుక్రవారం అమ్మవారికి వెండి కిరీటం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబం బాగుందని, అందుకే రూ.1.5లక్షలతో ఈ కిరీటాన్ని చేయించామని, పర్వ దినాలలో అమ్మవారికి వెండి కిరీటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటకృష్ణారెడ్డి, వేంకటేశ్వర్లు, కాశీబాబు, విజయనాయుడు, వెంకటాచలం, వెంకటకృష్ణయ్య, శేఖర్, శ్రీనివాసులు, సుబ్బయ్య, భక్తులు పాల్గొన్నారు.







వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో టికెట్ల కోసం తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ వద్ద క్యూలైన్‌లో శుక్రవారం వేకువజాము నుంచి పడిగాపులుకాశారు. కొంతమంది అక్కడే సేదతీరుతూ కనిపించారు. మరికొంతమంది భక్తులు వాహనాల్లో టికెట్ కేంద్రానికి తరలివచ్చారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి